S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 294 ఎడిటర్ : విక్రం కుమార్ బుధవారం 02, జూలై 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## అమెరికా..
# బాటలోనే బ్రిటన్

- వీసా నిబంధనలు కఠినతరం
- భారతీయులపై ప్రభావం



**జులై 01, సమయం న్యూస్, లండన్:** విదేశీ వలసదారుల విషయంలో అమెరికా బాటలోనే బ్రిటన్ (యూకే) పయనిస్తోంది. వివిధ ఉద్యోగాల్లో చేరే విదేశీ నిపుణులకు సంబంధించిన వీసా నిబంధనలను కఠినతరం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు కఠినతర వీసా నిబంధనల బిల్లును మంగళవారం పార్లమెంటులోని దిగువ సభ హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నూతన నిబంధనలు.. దేశ వలస విధానాన్ని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించే కొలమానాలని హోం మంత్రి యెవెట్ కూపర్ అభివర్ణించారు. వలస విధానాన్ని తమ ప్రభుత్వం క్రమబద్ధీకరించి, నియంత్రణలోకి తీసుకొస్తుందని తెలిపారు.

తరువాయి 2లో



## తెలంగాణలో
# అధికారమే లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతాం
- భాజపా కొత్త అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు
- బాధ్యతల స్వీకరణ
- హాజరైన కేంద్ర మంత్రులు, రాష్ట్ర నేతలు

**జులై 01, సమయం న్యూస్, హైదరాబాద్:** వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని భాజపా రాష్ట్ర నూతన సారథి ఎన్.రామచందర్‌రావు అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేశానన్నారు.

తరువాయి 2లో

## మృతుల కుటుంబాలకు
# రూ.కోటి ఆర్థిక సహాయం



- సిగాచీ పరిశ్రమ బాధితులకు సీఎం భరోసా
- మంత్రులతో కలిసి సంఘటన స్థలం పరిశీలన



**జులై 01, సమయం న్యూస్, సంగారెడ్డి:** హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ధాటికి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం,

తరువాయి 2లో

## దేశరాజధానిలో
# లాల్‌దర్వాజ బోనాలు

- సందడి చేసిన విదేశీయులు

దిల్లీ: లాల్‌దర్వాజ బోనాలు దేశరాజధాని దిల్లీలో రెండో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం ఇండియాగేట్ నుంచి తెలంగాణభవన్ వరకు మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు ధూంధాంగా జరిగింది. తొలుత సింహవాహిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెసిడెంట్ కమిషనర్ శశాంక్‌గోయల్ ఇండియాగేట్ వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి 150 మంది సాంస్కృతిక కళాకారుల సంప్రదాయ డప్పు మోతలు, పోతురాజుల ఆటలు, ఒగ్గుడోలు

తరువాయి 2లో






2లో

## తెలంగాణ రైతుకు..
# కేసీఆర్ మరణశాసనం

- మన నీటిని ఏపీకి తాకట్టు పెట్టారు
- 2015లో కృష్ణా నీటిని రాసిచ్చారు
- 811 టీఎంసీలకు 299 టీఎంసీలు చాలన్నారు
- 2016లో గోదావరిలో 3000 టీఎంసీల వరద నీరుందన్నారు
- చంద్రబాబు గోదావరి నీటి వినియోగంపై సర్వే చేపట్టినా వ్యతిరేకించలేదు
- జగన్‌ను ఇంటికి పిలిచి గోదావరి నీటితో రాయలసీమ సస్యశ్యామలం అన్నారు
- బనకచర్లపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం


2లో

## పట్టాభిరామ్
# కన్నుమూత...

- గుండెపోటుతో ఆసుపత్రిలో తుదిశ్వాస
- ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రచయితగా ప్రఖ్యాతి
- మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి.. కౌన్సెలింగ్‌తో ఎన్నో కుటుంబాలకు బాసట

**జులై 01, సమయం న్యూస్,** హైదరాబాద్, రవీంద్రభారతి, పంజాగుట్ట, గాంధీనగర్(కాకినాడ): ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్

తరువాయి 2లో





## లక్ష మంది మార్గదర్శులు...
# 15 లక్షల బంగారు కుటుంబాలు


- పేదలకు సాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- 2029 నాటికి పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- త్వరలో నిరుద్యోగ భృతి
- రౌడీలతో రాజకీయాలు చేయాల్సి వస్తోంది
- తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి 'ప్రజావేదిక'లో సీఎం చంద్రబాబు

2లో



## ఒక చేత్తో భాజపా జెండా..
# మరో చేత్తో కూటమి ఎజెండా

- రాష్ట్రంలో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా
- పార్టీ వైభవం, ప్రభుత్వ గొప్పతనం ప్రజల్లోకి తీసుకెళదాం
- భాజపా ఏపీ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



2లో

తరువాయి 2లో

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
www.samayamdaily.net



# తెలంగాణలో అధికారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు న్యాయవాదులు, విద్యార్థుల కోసం పోరాడానని, ఇకనుంచి తెలంగాణ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే... ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ జెండాను రామచందర్‌రావుకు అందించి.. సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు ప్రసంగించారు. ''14 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భాజపాలో తెలంగాణ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వంగా భావిస్తున్నా. అయినా సాధారణ కార్యకర్తగానే పనిచేస్తా. భాజపాలో కొత్త, పాత అనే తేడా ఉండదు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్తా కృషి చేయాలి. భారాస వాట్సప్ యూనివర్సిటీ, కాంగ్రెస్ ఫేక్ న్యూస్ యూనివర్సిటీలు నాపై ట్రోలింగ్ చేస్తున్నాయి. నేను సౌమ్యుడిని కాదు. 14 సార్లు జైలుకు వెళ్లాను. క్రిమినల్ లాయర్‌ను. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతాం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం. పార్టీ ఈ స్థాయికి వచ్చిందంటే కార్యకర్తల త్యాగాలు, నాయకుల కృషి కారణం'' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్, భారాసలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి: కిషన్‌రెడ్డి**

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుని అప్పులపాలు చేశాయని... భాజపా అధికారంలోకి వస్తేనే అమరవీరుల ఆకాంక్షలు నెరవేరుతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రామచందర్‌రావు సారథ్యంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు, నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా.. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. కేసీఆర్, రాహుల్ గాంధీ కుటుంబాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్రాన్ని దోచుకున్నారని... అన్ని రకాలుగా వెనక్కి నెట్టారని ఆరోపించారు. తెలంగాణకు గత పదకొండేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను కేంద్రం అందించిందని చెప్పారు. 40 రైల్వే స్టేషన్లతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిపై రాష్ట్రంలో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధమేనని భారాస, కాంగ్రెస్‌లకు కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.

# పట్టాభిరామ్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

గుండెపోటుతో కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సోమవారం సాయంత్రం డయాలసిస్ కోసం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఒమేగా ఆసుపత్రికి వెళ్లారు. ఆ తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అరగంటపాటు వైద్యులు శ్రమించినా ఫలితం లేకపోయింది. సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారని వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య జయశేషు, కుమారుడు వెంకటసాయి ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ సతీమణి కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలు. అభిమానుల సందర్శనార్థం పట్టాభిరామ్ భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి ఆనంద్‌నగర్ కాలనీలోని స్వగృహానికి బుధవారం ఉదయం 9 గంటలకు తరలిస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**ప్రదర్శనలతో జాగృతం చేశారు..**

పట్టాభిరామ్ 1950లో కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీల గ్రామంలో జన్మించారు. 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతుల 15 మంది సంతానంలో పట్టాభిరామ్ ఒకరు. కౌమార దశలో ప్రమాదంతో కాలి వైకల్యం కలిగి ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఆత్మన్యూనతాభావానికి లోనైనా.. తండ్రి ఇచ్చిన ధైర్యంతో దాన్ని జయించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో బీఏ చదువుతున్న రోజుల్లో ప్రముఖ ఇంద్రజాలికుడు ఎంబార్ రావు వద్ద మెలకువలు నేర్చుకున్నారు. డిగ్రీ అనంతరం కాకినాడలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఉద్యోగ విధులు నిర్వహించారు. కాకినాడలో అనేక స్టేజీలపై ఇంద్రజాల ప్రదర్శనలిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవారు. అనంతరం బదిలీపై హైదరాబాద్ వచ్చారు. ఇక్కడా తన ప్రదర్శనలను కొనసాగించి పేరు తెచ్చుకున్నారు. 1984లో.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న సమయంలో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్‌కు.. అక్కడి నుంచి మళ్లీ రవీంద్రభారతికి స్కూటర్ నడిపారు. తన ఇంద్రజాల ప్రదర్శనలతో మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేశారు. హిప్నాటిజాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు.

# అమెరికా బాటలోనే బ్రిటన్

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం భారీగా వలసలను ప్రోత్సహించిందని, దీనివల్ల కేవలం నాలుగేళ్లలోనే వలసలు నాలుగు రెట్లు పెరిగాయని వెల్లడించారు. విదేశీ వలసలను వీలైనంతగా తగ్గించి, వివిధ నైపుణ్యాల పెంపు కోసం బ్రిటన్ పౌరులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం.. ఉద్యోగుల నైపుణ్యాలకు విలువ ఇస్తుందని, అయితే వారు శ్రమ దోపిడీకి గురి కాకుండా నివారిస్తుందని కూపర్ స్పష్టం చేశారు. బ్రిటన్‌కు వచ్చే విదేశీయులంతా సరైన రీతిలో, సరైన దిశగా సేవలను అందించగలిగేలా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ఈ విషయంలో రాజీపడేది లేదని తేల్చి చెప్పారు.

**జులై 22 నుంచి అమల్లోకి?**

ఈ ఏడాది మే నెలలో బ్రిటన్ సర్కారు విడుదల చేసిన ఇమ్మిగ్రేషన్ శ్వేతపత్రంలోనే ఈ కొత్త వీసా నిబంధనలను ప్రతిపాదించారు. తాజాగా వాటిని హౌజ్ ఆఫ్ కామన్స్‌లో ప్రవేశపెట్టడం ద్వారా చట్టపరమైన ఆమోదం దిశగా కసరత్తును మొదలుపెట్టారు. పార్లమెంటు ఆమోదం పొందాక.. జులై 22 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఈ నిబంధనల ప్రభావం ఎంతో మందిపై భారతీయులపై పడనుంది. ఎందుకంటే ఏటా చాలా మంది భారతీయులు బ్రిటన్‌లో ఉన్న పర్సనల్ కేర్ సెంటర్లు, హోటళ్లు, భవన నిర్మాణ సంస్థలు, ఆసుపత్రుల్లో దిగువ స్థాయి ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

# దేశరాజధానిలో లాల్‌దర్వాజ బోనాలు

నాట్యాలు, పూర్ణకుంభాల మధ్య అమ్మవారి ఘటాల ఊరేగింపు తెలంగాణభవన్ వరకు సాగింది. ఈ కార్యక్రమం దేశరాజధానిలో వివిధ రాష్ట్రాల ప్రజలతోపాటు, విదేశీపర్యాటకులను విశేషంగా ఆకట్టుకొంది. పలువురు విదేశీయులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా చూస్తూ భారతీయ సాంస్కృతిక రూపాలను, బోనాల పండగ వైభవాన్ని ఫొటోలు, వీడియోల్లో బంధించారు. ఊరేగింపు అనంతరం తెలంగాణ భవన్‌లో ఘటాల స్థాపన జరిగింది.



# మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం

(మొదటి పేజీ తరువాయి)

కర్మాగారం యాజమాన్యం సమన్వయంతో రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ మేరకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పేలుడుకు కారణాలపై సమీక్షించారు. కర్మాగారంలో పీరియాడికల్ తనిఖీలు చేస్తున్నారా అని ఫ్యాక్టరీస్ భద్రతా విభాగం అధికారులను ఆరాతీశారు. ఎవరి వైఫల్యంతో ఇంత పెద్ద ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి డ్రయ్యర్లను ఎందుకు తనిఖీ చేయలేదని నిలదీశారు. తర్వాత కంపెనీ ఎదుట ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఎం మాట్లాడుతూ... ''ఇది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. కర్మాగారంలో ప్రమాదం జరిగే సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 58 మంది సురక్షితంగా ఉన్నారు. మరికొందరి ఆచూకీ కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు అందిస్తాం. తక్షణ సాయంగా మృతిచెందిన కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించాం. గాయపడిన కార్మికులకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాం. మృతదేహాలను వారి సొంతూళ్లకు తరలించేలా చూస్తాం. రెండు రోజుల నుంచి ఇద్దరు మంత్రులు, కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర యంత్రాంగం కర్మాగారంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేస్తున్నారు.

*** ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక విధానం**

సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి కారణాలను కనుగొనేందుకు సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ వేశాం. ఈ పరిశ్రమలో కాలానుగుణ (పీరియాడికల్) తనిఖీలు ఎలా జరిగాయో పరిశీలించాలని, తనిఖీలు జరిగితే లోపం ఎక్కడుందనేది తేల్చాలని సూచించా. వారిచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రసాయన, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం'' అని వివరించారు. సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

*** సిగాచీ పరిశ్రమ ప్రతినిధులెక్కడ?**

''సిగాచీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులెక్కడ? సమీక్ష సమావేశానికి వారెందుకు హాజరు కాలేదు. ఇంత పెద్ద ప్రమాదం చోటుచేసుకుంటే... వారు వచ్చి బాధితులకు అండగా నిలవాలి కదా? ఇక్కడికి రాలేనంత బిజీగా ఉంటే పరిశ్రమను నిర్వహించడం ఎందుకు? మూసేయండి. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని తక్షణమే వారిని పిలిపించాలి. సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలి. మృతుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు సంస్థపరంగా లభించే సౌకర్యాలు కల్పించాలి'' అంటూ కంపెనీ ప్రతినిధితోపాటు అధికారులను సీఎం ఆదేశించారు.

# తెలంగాణ రైతుకు.. కేసీఆర్ మరణశాసనం

హైదరాబాద్: కృష్ణా, గోదావరి జలాలను కేసీఆర్, హరీశ్‌రావులు ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టి.. తెలంగాణ రైతులకు మరణ శాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీలలో తెలంగాణకు 555 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలు చాలని 2015లో వారిద్దరూ రాసిచ్చారన్నారు. గోదావరిలో 3,000 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి వెళ్తోందని, ఈ నీటిని రాయలసీమకు మళ్లించుకోవచ్చని 2016లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పారని, ఈ విషయాన్ని మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. 2019లో గోదావరి నీటిని మళ్లించి రాయలసీమను రతనాల సీమగా చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం చోద్యం చూస్తోందని, తెలంగాణ హక్కులను కాలరాయడానికి 8 మంది ఎంపీలను భాజపాకు ఇవ్వలేదని విమర్శించారు. భారాసను బతికించడానికి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ హక్కులను రక్షించుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తేవాలని, పోరాడాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు, శ్రేణులకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అబద్ధాలతో నీటి సెంటిమెంట్‌ను రగల్చడానికి ప్రయత్నిస్తున్నారని, అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

**వారి ధనదాహాన్ని తీర్చుకోవడానికే కాళేశ్వరం**

''కేసీఆర్ ధనదాహాన్ని తీర్చుకోవడానికి ప్రాణహిత చేవెళ్ల పేరు, ఊరు మార్చడంతో పాటు అంచనా పెంచి కాళేశ్వరం చేపట్టారు. రూ.1.50 లక్షల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.లక్షా రెండువేల కోట్ల విలువైన పనిచేసి రూ.96,000 కోట్లు చెల్లించారు. ఇంత ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారు. కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి గతంలో తాకట్టు పెట్టిన కేసీఆర్, హరీశ్‌రావు.. ఆ రాచపుండునే ఇప్పుడు సమస్యగా సృష్టించాలని చూస్తున్నారు. భారాస పునరుజ్జీవానికి నీటి సెంటిమెంట్‌ను వాడుకోవడానికి చూస్తున్నారు. ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటుచేసి ఒకరోజు కృష్ణాపై, మరోరోజు గోదావరిపై చర్చిద్దాం రమ్మంటే భారాస ముందుకు రాలేదు. ఆపార్టీ నేతలది వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడ. నదీ జలాలను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లి దోషులుగా నిలబెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ మనుగడ చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు ప్రభుత్వ మనుగడ గోదావరి ప్రాజెక్టులపై ఉంది. ఈ లెక్కలన్నీ ఒక్క రోజులోనో, ఒక ఏడాదిలోనో తేలేవి కావు. ఇవన్నీ ప్రజలకు వివరించాలి.

**భాజపా సహాయ నిరాకరణ**

గత 11 ఏళ్లుగా నీటి సమస్యలపై భాజపా ఏ నిర్లక్ష్యం చూపిందో ఇప్పుడూ అదే కొనసాగిస్తోంది. భారాసను బతికించడానికి భాజపా పరోక్షంగా సాయం చేస్తోంది. కాంగ్రెస్ నేతలంతా ఆపార్టీపైనే దృష్టి పెట్టాలి. కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతిమాట కేటీఆర్ కార్యాలయం నుంచి వచ్చిందేనని నేను చెబుతున్నా. మేం వెళ్లి కిషన్‌రెడ్డిని కలసి తెలంగాణ సమస్యలను వివరిస్తే.. ఏ రోజూ మమ్మల్ని ఏ కేంద్ర మంత్రి వద్దకూ తీసుకెళ్లలేదు. నీటి సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల మధ్య పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు చూస్తోంది. ఏపీ నేతలు వారి రాష్ట్రానికి చెందిన సమస్యల గురించి కేంద్రంలో ప్రతి ఒక్కరినీ కలుస్తుంటే కిషన్‌రెడ్డి ఒక్క పనీ చేయకుండా సమస్యలు కొనసాగాలని చూస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చి తెలంగాణకు సహకరించాలి.

**నాటి సీఎం ఇచ్చిన వివరాలతోనే..**

2016లో జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి నుంచి సముద్రంలోకి 3000 టీఎంసీలు పోతున్నాయని కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశం తర్వాత గోదావరి పెన్నా అనుసంధానానికి డీపీఆర్ బాధ్యతను వాప్కోస్ సంస్థకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారు. గోదావరి పెన్నా మొదటి దశపై 2018లో మరో జీఓ ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ ఇచ్చిన వివరాలతోనే గోదావరి జలాలను పెన్నాకు తరలించడానికి మొదటిదశ కింద వాప్కోస్‌తో ఏపీ ప్రభుత్వం సర్వే చేయిస్తే వారు 4 రకాల ఆప్షన్లు ఇచ్చారు. దీనిప్రకారం 400 టీఎంసీలను తరలించడానికి అవకాశం ఉందన్నారు. బనకచర్లలో 200 టీఎంసీలు ఎత్తిపోయడానికి ఇప్పుడు పంపులు పెడుతున్నా.. 300 టీఎంసీలు తీసుకెళ్లేలా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. మళ్లీ జగన్ సీఎం కాగానే నాటి ప్రగతిభవన్‌కు పిలిచి పెన్నానది వరకూ గోదావరి జలాలు తరలించవచ్చని కేసీఆర్ చెప్పారు. గోదావరిపై 968 టీఎంసీలను వాడుకోవడానికి మేం ప్రాజెక్టులు కట్టుకున్న తర్వాతే వరద, మిగులు జలాల లెక్కలు తేలతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల నుంచి 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలి. ఈ నీటిని, మైనర్ ఇరిగేషన్‌లో ఆదా అయిన నీటిని కలిపి పాలమూరురంగారెడ్డికి అనుమతి తెచ్చుకోవడానికి ఏపీ సహకరించాలి.

# లక్ష మంది మార్గదర్శులు... 15 లక్షల బంగారు కుటుంబాలు

రాజమహేంద్రవరం, కాకినాడ, తాళ్లపూడి: 'సామాన్య కుటుంబంలో పుట్టి అవకాశాలను అందిపుచ్చుకుని పైకి ఎదిగినవారు ఉన్నారు. వారిలో నేనూ ఒకడిని. రోజూ ఆరేడు కి.మీ. పాఠశాలకు నడిచి వెళ్లి చదువుకున్నాను. మనతో పాటు పుట్టిన వాళ్లలో కొందరు ఇంకా వెనుకబడి ఉన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి పేదరికం నుంచి బయటకు తేవాలన్న లక్ష్యంతో పీ4 కార్యక్రమానికి రూపకల్పన చేశాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం 'ప్రజావేదిక' సభలో ఆయన ప్రసంగించారు. 'ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించి లక్ష మంది మార్గదర్శుల చేత సాయం అందించే లక్ష్యం పెట్టుకున్నాం. 2029 కల్లా పేదరికం లేని సమాజ నిర్మాణం దిశగా ముందుకెళ్తున్నాం' అని సీఎం చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని.. నిరుద్యోగ భృతికి త్వరలో శ్రీకారం చుడతామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందన్నారు. 'అన్నదాతా సుఖీభవ' ద్వారా కేంద్రం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన రోజే తామూ వేస్తామన్నారు. తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు ఖాతాల్లో వేశామని.. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు జరుగుతున్నాయని వారికీ లబ్ధిని చేకూరుస్తామని వివరించారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.9.54 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని.. 8.50 లక్షల మందికి లభిస్తాయని సీఎం చెప్పారు. ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయన్నారు. గత పదేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయో ఒక్క ఏడాదిలోనే అంతకంటే ఎక్కువ తెచ్చామన్నారు.

# ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండా

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భాజపాను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని, పార్టీ కార్యకర్తలు గర్వపడేలా బలోపేతం చేస్తానని భాజపా ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా ఆంధ్రప్రదేశ్ సంఘటన్ పర్వ్ రాష్ట్ర అధ్యక్ష, జాతీయ మండలి సభ్యుల ఎన్నికల వేడుక విజయవాడలో మంగళవారం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడిగా మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల పరిశీలకుడు పీసీ మోహన్ ప్రకటించారు. జాతీయ మండలి సభ్యులుగా ఎన్నికైన వారి వివరాలు వెల్లడించారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి పాకా వెంకట సత్యనారాయణ ధ్రువీకరణ పత్రాన్ని మాధవ్‌కు అందించారు. అనంతరం దగ్గుబాటి పురందేశ్వరి నుంచి మాధవ్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి హోదాలో మాధవ్ మాట్లాడారు. ''ఒక చేత్తో భాజపా జెండా.. మరో చేత్తో కూటమి ఎజెండాను రాష్ట్రంలో పారదర్శకంగా తీసుకెళ్లాలి. గత ప్రభుత్వ ఐదేళ్ల నిరంకుశ పరిపాలనకు ప్రజలు చరమ గీతం పాడి.. 11 సీట్లకే పరిమితం చేశారు. కూటమిపై ప్రజలు ఉంచిన విశ్వాసం నిలబెట్టుకునేలా కలిసికట్టుగా కృషిచేయాలి. అధ్యక్ష పదవి అంటే గొప్ప స్థానం కాదు. అదొక బాధ్యత. పార్టీ కోసం ఎంతోమంది పనిచేస్తున్నా నా మీద నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళదాం. నరేంద్ర మోదీ రాష్ట్రానికి చేస్తున్న సాయం ప్రజలకు వివరిద్దాం. మన అందరికీ రాష్ట్రమంటే అభిమానంతోపాటు జాతీయ స్ఫూర్తి ఉండాలి. మన ప్రాంతంలోని సౌకర్యాలు, సంపద, సంస్కృతికి పునరుజ్జీవం పోయాలి. గుజరాత్‌ను మించి సంపద సృష్టించగలిగే ప్రాంతం ఆంధ్ర.. అమరావతిని స్థిర రాజధానిగా చేసుకోవాలి. రాష్ట్ర నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలి. తెలుగు భాషకు మించిన భాష ప్రపంచంలో లేదు. ప్రభుత్వాలు మన భాషను ప్రోత్సహించడంలో వెనకబడుతున్నాయి. గత ప్రభుత్వం తెలుగును విస్మరించింది. తెలుగు భాష ఉన్నతి కోసం భాజపా శ్రమిస్తుంది'' అని మాధవ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు పార్టీ కోసం రాష్ట్రమంతా తిరిగే అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి మాధురిని పలువురు నేతలు తమ ప్రసంగాల్లో కోరారు. దీంతో నవ్వులు విరిశాయి. మాధవ్ సతీమణి, పిల్లలను వేదికపైకి రమ్మని నేతలు కోరగా ఆమె సున్నితంగా తిరస్కరించారు. వేదిక కింద నుంచే పిల్లలతో కలిసి కార్యకర్తలకు అభివాదం చేశారు.

*** భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు**

*** ప్రతిఘటించిన వారికీ ధన్యవాదాలు: పురందేశ్వరి**

భాజపా తనకు సముచిత గౌరవం ఇచ్చిందని, రాష్ట్ర అధ్యక్ష పదవితోపాటు రాజమహేంద్రవరం ఎంపీ హోదా కల్పించిందని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ''పెద్దలు నేర్పిన విలువలు.. వారు చూపిన నాయకత్వంతో పట్టుదలతో రెండేళ్లు పార్టీ కోసం పనిచేశా. నన్ను ప్రోత్సహించిన వారికి, ప్రతిఘటించిన వారికీ ధన్యవాదాలు'' అని వ్యాఖ్యానించారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నూతన అధ్యక్షుడు పనిచేయాలని సూచించారు.

*** మనమే సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలి: శ్రీనివాసవర్మ**

రాష్ట్రంలో మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని, మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.

# ముషీరాబాద్ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఘనంగా వైద్యుల దినోత్సవం





హైదరాబాద్, జూలై 1 (ప్రతినిధి): ముషీరాబాద్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్ జోన్ మరియు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (UFORWA) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పలువురు ప్రముఖులు, కమ్యూనిటీ నేతలు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన సంఘనేతలు, డాక్టర్ల అంకితభావాన్ని కొనియాడారు. కరోనా వంటి సంక్షోభ పరిస్థితుల్లోను, రోజువారీ ఆరోగ్య సమస్యల పరిష్కారంలోను వైద్యులు చూపిన సేవా మనోభావం అసాధారణమని అన్నారు.

*** డాక్టర్ మనోజ్ సేవలు ప్రశంసనీయం**

ముషీరాబాద్ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న డాక్టర్ మనోజ్ మరియు ఆయన బృందానికి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. వైద్యుడిగా మాత్రమే కాకుండా, మానవతా విలువలకు నిలువెత్తు ఉదాహరణగా డాక్టర్ మనోజ్ సేవలందిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, మహమ్మారి సమయంలో ఆయన చేసిన కృషిని ప్రత్యేకంగా గుర్తు చేశారు.ఈ సందర్భంగా పలువురు ఆరోగ్య శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొని వైద్యుల సేవలను ప్రశంసించారు. వైద్యుల కృషికి గుర్తింపు ఇవ్వడం, ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, "తెల్ల కోటు ధరించిన నిజమైన హీరోలు" అని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా శ్రమించే వైద్యులను గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యద్ ఖలీద్ షా, కార్యదర్శి, యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (UFORWA), ఎల్. శ్రీలత, కన్వీనర్, డ్రగ్ వాచ్ టీం, UFORWA, జి. మనీలా విజయలక్ష్మి, శాంతి కమిటీ సభ్యురాలు, అవైస్ మీర్జా, ఈస్ట్ జోన్ శాంతి కమిటీ సభ్యుడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

*** పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్**

జిన్నారం, జూలై 1, సమయం న్యూస్ : జులై 4వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నేతలు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరుకానున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరిదని అన్నారు. ఈ సభ రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలవబోతుందని, పటాన్ చెరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రారెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వీరారెడ్డి, రాజు గౌడ్,గోవర్ధన్ గౌడ్,సీతారాం సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఇండియా మిషన్ సందేశం – శ్రీ చైతన్య పాఠశాల, బర్కత్‌పుర శాఖ

**హరిత భారత్ – సమృద్ధి భారత్**



అంబర్ పేట, జూలై,1 (సమయం న్యూస్) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యం. పర్యావరణ విశిష్టత గురించి దాని ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేసిన స్థానిక ఎమ్మెల్యే కాలేరు ప్రతి ఏటా శ్రీ చైతన్య టెక్నో స్కూల్ లో పాఠశాల ఆవరణలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఉదయం మొక్కలు నాటిన అంబర్పేట నియోజకవర్గం శాసనసభ సభ్యులు కాలేరు వెంకటేష్. ఈ ఉద్దేశంతో శ్రీ చైతన్య పాఠశాల, బర్కట్‌పుర బ్రాంచ్లో గ్రీన్ ఇండియా మిషన్ లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అంబర్‌పేట శాసన సభ్యులు శ్రీ కాలేరు వెంకటేష్ గారు స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరి సానుభూతి మరియు స్ఫూర్తిదాయక భాగస్వామ్యం విద్యార్థులలో పర్యావరణ పట్ల ప్రేమను పెంచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రుబీనా, ఏజీఎం మొగల్నూర్ మహమ్మద్ అలీ, ఆర్ ఐ మల్లికార్జున నాయుడు, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ధర్మేందర్ ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసీ కి రూ. 1 కోటి విలువ గల 10 మహీంద్రా జియో EV వాహనాలు అందజేసిన ఎస్.బి.ఐ

హైదరాబాద్, జులై 01(సమయం న్యూస్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తన 70వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సామాజిక బాధ్యతగా (CSR) కింద ఎస్.బి.ఐ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC)కి రూ. 1 కోటి వ్యయంతో 10 మహీంద్రా జియో EV వాహనాలను విరాళంగా అందించింది. మంగళవారం SBI స్థానిక ప్రధాన కార్యాలయం, కోటి ప్రాంగణంలో SBI చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. రాధాకృష్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కు వాహనాల కీలు అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్వి కర్ణన్ మాట్లాడుతూ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు సిఎస్ఆర్ పద్ధతి ద్వారా 10 వాహనాలను అందజేసినందుకు అభినందలు తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మరిన్నిసేవలు అందించదానికి ఈ వాహనాలు ఎంతగానో దోహద పడుత్తాయన్నారు. మిగతా సంస్థలు కూడా జిహెచ్ఎంసి కి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ డిప్యూటీ జనరల్ మేనేజర్లు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్, ఎస్.బి.ఐ అధికారులు, వెటర్నరీ డి.డి డాక్టర్ జె.డీ. విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా శాఖలో సమూల మార్పు.. విధుల్లో అలసత్వం వద్దు

*** స్పోర్ట్స్ స్కూళ్ల ఎంపికలో పైరవీలకు తావు లేదు**
*** కోచులకు పునఃశ్చరణ తరగతులు**
*** స్పోర్ట్స్ స్కూళ్ల పనితీరు మెరుగుపడాలి**
*** క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**




అంబర్ పేట, జూలై,1 (సమయం న్యూస్) : తెలంగాణ క్రీడా పాఠశాలల్లో సమూల మార్పు జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర క్రీడ యువజన సర్వీసులు మరియు పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈరోజు నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపికల ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ క్రీడా పాఠశాలలు హకీంపేట కరీంనగర్ అదిలాబాదుల లో క్రీడా పాఠశాల నిర్వహణలో సమూలమైన మార్పులు జరగాల్సిన అవసరం ఉందని మూడు నెలల్లో వీటి పనితీరును మెరుగుపరిచి చూపిస్తామని ఆయన ప్రకటించారు. క్రీడా పాట శాలల ఎంపికలో ఎటువంటి పైరవీలకు ఆస్కారం ఉండకూడదని, పాఠశాలల విద్యార్థుల ఎంపికలో ఎటువంటి ఒత్తిడిలు వచ్చిన పారదర్శకంగా వ్యవహరించి క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కరీంనగర్ అదిలాబాద్ లో ఉన్న పాఠశాలల కూడా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సందర్భంగా విద్యార్థుల్లో తల్లిదండ్రులు అందరితో ఆయన మాట్లాడుతూ, ఎంపిక కానీ పిల్లలను క్రీడలకు దూరం చేయకుండా వారిని క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడా పాఠశాలలు అకాడమీ లలో విద్యార్థుల ఎంపిక తర్వాత వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా కోచులు సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. నూతన క్రీడా విధానం అనుసరించి అంచలంచలుగా కోచులు మరియు క్రీడా సిబ్బంది సంఖ్యను పెంచుకుంటూ పోవడమే కాకుండా, ప్రతి సంవత్సరం కోచులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించి వారి పనితీరును మెరుగు పరుస్తామని అన్నారు. ఫలితాలు సాధించే కోచులను ప్రోత్సహిస్తూనే, ఫలితాలు తీసుకురాని, క్రీడా శిక్షకులను ఉపేక్షించబోమని ఆయన అన్నారు. ఇకముందు స్పోర్ట్స్ స్కూల్ లను అకాడమీ లను ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన స్పోర్ట్స్ స్కూల్ క్యాంటీన్, కిచెను ను పరిశీలించి మరింత శుభ్రతను పాటించాలని పిల్లలకు అందించే ఆహారం మరింత పరిశుభ్రంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పాటు లైన్లో నిలబడి, భోజనం తీసుకోవడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. ప్రతి 10 సంవత్సరాల నుండి క్రీడా శాఖ పనితీరు కుంటుపడిందని, సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అన్ని రంగాల్లో మాదిరిగానే క్రీడా శాఖలో మార్పు మొదలైందని, సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచన అందుకొని క్రీడాభివృద్ధి కోసం శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టీ మమత, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు, స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.




# జిన్నారంలో వాహనాల తనిఖీలు

జిన్నారం, జూలై 1, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారం లో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. జిన్నారం సిఐ నయీముద్దీన్ ఆదేశాల మేరకు ఎస్సై నాగలక్ష్మి, పోలీసు బృందం ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వారిపై నిఘా పెంచామని వారు తెలిపారు. ఎవరైనా అనుమానంగా తారాసపడితే వివరాలు సేకరించి, సరైన పత్రాలను చూసి పంపిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

# నిషేధిత దగ్గు మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులో పోలీస్ తనిఖీలు

వరంగల్ జూలై 1 (సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం అందిన సమాచారం మేరకు ఈరోజు పోలీసులు స్థానిక డ్రగ్ అధికారి కిరణ్ తో రంగశాయి పేట లోని ఆయుష్ మందుల షాపులో విస్తృతమైన తనిఖీలు చేయగా మత్తు కలిగించే ప్రభుత్వ నిషేధిత దగ్గు మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున నిషేధిత దగ్గు మందులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసారు. ఈ తనిఖీల్లో ఆర్. ఐ శివ కేశవులు, ఆర్. ఎస్. ఐ మనోజ్, పూర్ణ, నాగరాజు తో యాంటీ డ్రగ్స్ కంట్రోల్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

*** భూగర్భ జలాల పెంపుకు చర్యలు**
*** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జూలై 1(సమయం న్యూస్): జిల్లా లోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నన్స్ కార్యక్రమం కింద.. మంగళవారం తమిళనాడు నుండి సర్పంచ్, బ్లాక్ ప్రసిడెంట్, అధికారులు జిల్లా కి క్షేత్రస్తాయి పరిశీలన కై రాగా... వారిని లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి డిపోఓ స్వరూప తీసుకెళ్లి... తడి పొడి చెత్త,పారిశుధ్య నిర్వహణ, నర్సరీ లో మొక్కల పెంపకం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం జడ్పీ కార్యాలయనికి వచ్చిన తమిళనాడు బృందం తో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా లోని ప్రతీ గ్రామపంచాయతీ లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయం,నర్సరీలో మొక్కల పెంపకం విధానం, భూగర్భ జలాల పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, తద్వారా పెరిగిన ఆయకట్టు, పంటల సాగు,పక్కాగా శానిటేషన్ నిర్వహణ వల్ల సీజనల్ వ్యాధులను అరికడుతున్న తీరును సర్పంచ్ బృందానికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ మాధురి షా, డిపిఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పుట్టినరోజు సందర్భంగా వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ.

*సమయం న్యూస్, చీపురుపల్లి స్థానికం, జులై 1:*



తొగుట రైతు వేదికలో దుబ్బాక డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి మరియు దుబ్బాక డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మల్లయ్య ల ఆధ్వర్యంలో రైతులకు కంది పంట యొక్క రాయితి మిని కిట్స్ పంపిణి చేయుట జరిగింది.ఆత్మ చైర్మెన్ మాట్లాడుతు రైతులు కంది పంట యొక్క విస్తీర్ణం పెంచుట వలన దిగుబడి ఎక్కువగా వస్తుందని అలాగే కంది యొక్క ధర అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమమంలో వ్యవసాయ అధికారి మోహన్ మరియు విస్తరణ అధికారి రాజేష్ మరియు ఆత్మ కమిటీ డైరెక్టర్లు,రైతులు పాల్గొన్నారు.

*జులై 1, సమయం న్యూస్, తొగుట*



## హస్తినలో ధూంధాంగా లాల్ దర్వాజ బోనాలు

* **విదేశీయులను సైతం ఆకట్టుకున్న తెలంగాణ సంస్కృతీ శోభ..**

న్యూ ఢిల్లీ, జూలై1 (సమయం న్యూస్) : మంగళ వారం నాడు దేశ రాజధాని ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాలు రెండో రోజు ధూంధాంగా జరిగాయి.నిన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు వర్మ చేతుల మీదుగా ప్రారంభమయిన లాల్ దర్వాజ బోనాల రెండవ రోజు ఉత్సవాల్లో భాగంగా నేడు ఇండియా గేట్ నుండి తెలంగాణ భవన్ వరకు మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో, సాంస్కృతిక నృత్యాల మధ్య అత్యంత అట్టహాసంగా నిర్వహించబడింది. ముందుగా సింహవాహినీ ఆలయ కమిటీ సభ్యులు ఇండియా గేట్ వద్ద అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ భవన్ రెసిడెంట్ కమీషనర్ డా.శశాంక్ గోయల్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం 150 మంది సాంస్కృతిక శాఖ కళాకారుల సంప్రదాయ పూర్వక డప్పుల మోతలు, పోతురాజుల ఆటలు,ఒగ్గుడోలు కళాకారుల నాట్యాలు,పూర్ణ కుంభాల మధ్య సాగిన అమ్మ వారి ఘటాల ఊరేగింపు ఇండియా గేట్ వద్ద ఉన్న వివిధ రాష్ట్రాల ప్రజలతో పాటు అక్కడకు వచ్చిన విదేశీయులను సైతం విశేషంగా ఆకర్షించింది.పలువురు విదేశీయులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షిస్తూ, బోనాల పండుగ వైభవాన్ని ఫోటోలు, వీడియోల రూపంలో బంధించడమే కాదు, తెలంగాణ కళారూపాలపై ప్రశంసలు కురిపించారు. ఊరేగింపు అనంతరం తెలంగాణ భవన్‌లో ఘట స్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. తెలంగాణ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలతో పాల్గొనడం, కళాకారుల వాయిద్యాలతో కూడిన సాంస్కృతిక నృత్యాలు, పోతురాజుల ఆటలతో తెలంగాణ భవన్ వాతావరణం ఉత్సాహ భరితంగా మారింది.



# హాస్టల్స్ విజిట్ క్యాలెండర్ రూపొందించండి

* **అద్దె భవనాల్లో వసతులపై సమీక్షించండి**
* **సంక్షేమ విద్యార్థుల హెల్త్ రికార్డ్ రూపొందించండి**
* **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



హైదరాబాద్ జూలై1 (సమయం న్యూస్) : సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్ రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం ప్రజాభవన్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ అధికారి, ఏ రోజు పర్యటించారు.. వారు పరిశీలించిన అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ పర్యటన కార్యక్రమం నిరంతరం సాగాలని, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను సైతం పర్యటనకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పెంచిన 40 శాతం డైట్, 200% కాస్మోటిక్ ఛార్జీలను పెంచి, డాక్టర్ల సూచన మేరకు పకడ్బందీ మెనూ ఖరారు చేసాం. ఈమెనూ అన్ని సంక్షేమ హాస్టల్లో, గురుకులాల్లో ప్రముఖంగా కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. వసతి గృహాల అదే భవనాల్లో వసతులు ఎలా ఉన్నాయి, భవనాలు, యజమానుల వివరాల తో ఒక నివేదిక రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. అన్ని వసతి గృహాల్లో దోమతెరలు ఏర్పాటు చేయాలి, రన్నింగ్ వాటర్ సప్లై లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డు లు రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారులను సమన్వయం చేసుకొని హెల్త్ కార్డు లు రూపొందించే కార్యక్రమం వేయంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్యం ఏర్పడితే ఆన్లైన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయని వారి సేవలను వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలన్నిటి పైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలు తీర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ అమలు తీరు, సొసైటీల వారిగా సెంటర్ ఆఫ్ exlence ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ గురుకుల సెక్రటరీ అలుగు వర్షిని, సాంఘిక సంక్షేమ శాఖ డిడి క్షితిజ, మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్ షఫీ, బీసీ గురుకుల సెక్రెటరీ సైదులు, ఎస్టీ గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భాషా సంస్కృతిక శాఖ నుండి మామిడి హరికృష్ణను సస్పెండ్ చేయాలి

* **ఉద్యమ కళాకారుల వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల నర్సింలు**



తొగుట జులై 1 (సమయం న్యూస్) : గత 11 సంవత్సరాలుగా నడుస్తున్న ఉద్యమానికి చీడపురుగుల వ్యవహరిస్తున్న మామిడి హరికృష్ణ గత టిఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి 362 నిరుద్యోగ కళాకారుల లిస్టు పంపివ్వడం జరిగింది అది సెక్రటేరియట్ నుండి మామిడి హరికృష్ణకు రావడం జరిగింది దానికి ఆయన ఎ లాంటి నివేదిక పంపించలేదు ఒక సంవత్సరం తర్వాత మళ్లీ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న తరుణంలో ప్రణాళిక ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్ ను కలిస్తే ఆయన కూడా 362 లిస్టు టైపు కొట్టి ముఖ్యమంత్రిపేసికి పంపించడం జరిగింది ఆ ఫైల్ కూడా సంస్కృతిక శాఖ కు పంపడం జరిగింది దానికి కూడా ప్రభుత్వానికి ఏ నివేదిక పంపించలేదు ఎన్నోసార్లు ఆయనను కలిసిన. ఫలితం లేకుండా పోయింది. ఆయనకు కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ నిరుద్యో కళాకారుల పైన లేదు చివరిగా కెసిఆర్ గారి కూతురు ఎమ్మెల్సీ కవిత గారి కి నిరుద్యోగ కళాకారులు అందరూ కలవడం జరిగింది ఆమె 482 కళాకారుల లిస్టు పాటు ఆమె లెటర్ ప్యాడ్ మీద గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి పంపించడం జరిగింది ముఖ్యమంత్రి నుండి ఫైలు సెక్రటేట్లో మాధవి మేడం దగ్గరికి అక్కడినుండి సంస్కృతిక శాఖ కు రావడం జరిగింది ఆ ఫైలు కూడా ప్రభుత్వానికి నివేదిక పంపించకపోవడమే. కాక ఎప్పుడో పంపించానని అబద్ధాలాడి నిరుద్యోకలాకారుల బ్రతుకులతో ఆడుకున్న చరిత్ర మామిడి హరికృష్ణ ది ఆయనకు కమిషన్ల కక్కుర్తి తప్ప కళాకారులపై ప్రేమ ఏ నాడు లేదు... ఈ ప్రభుత్వ ఉద్యోగి అయినా మూడు సంవత్సరాలు లేదా ఐదు సంవత్సరాల వరకు బదిలీ అవుతారు కానీ ఈయన 12 సంవత్సరాలు గడిచిన బదిలీ కాకుండా అదే సీట్లో కూర్చొని పైరవీలకు పాల్పడుతూ చక్రం తిప్పుతున్నాడు. ఇప్పుడైనా ఈప్రభుత్వం మ నిరుద్యోగ కళాకారుల గురించి ఆలోచించి ఒక కమిటీ వేయడం జరిగింది చాలా సంతోషం కానీ ఇందులో కూడా అవకతవగలకు పాల్పడ్డాడు దానికి నిదర్శనం తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేకుండా తెలంగాణ వచ్చాక భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో ప్రోగ్రాలు నిర్వహించుకుంటూ ఉన్నటువంటి తన జిల్లాకు చెందిన వ్యక్తికి ఆ కమిటీలో చోటు కల్పించడం లో కీలక పాత్ర పోషించి కళాకారుల బతుకులతో ఆడుకుంటున్న మామిడి హరికృష్ణను తక్షణమే సస్పెండ్ ఈ డైరెక్టర్ మామిడి హరికృష్ణ. ఉన్నంతకాలం మ నిరుద్యోగ కళాకారులకు అన్యాయమే జరుగుతుంది. హైకోర్టు తీర్పునే దిక్కరించి నోటిఫికేషన్ వేసినట్టే వేసి మళ్లీ పాత కళాకారులకే ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మామిడి హరికృష్ణ ది. ఇప్పటికీ ఆయన దృష్టి ఆంధ్ర సినిమా వాళ్ళ మీదనే ఉంటుంది నిరుద్యోగ ఉద్యమ కళాకారుల పైన ఆయనకు ఎప్పటికీ సవతి తల్లి ప్రేమే అతన్ని ఆ శాఖ నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం.

# విస్తృత తనిఖీలు నిర్వహించిన కలెక్టర్

* **రేషన్ షాపును సందర్శించి సన్నబియ్యం పంపిణీపై ఆరా**
* **భూభారతి దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియ పరిశీలన**
* **ఎరువుల పంపిణీ కేంద్రం తనిఖీ**
* **పశు వైద్యశాల సందర్శన**





నిజామాబాద్, జూలై 01( సమయం న్యూస్): నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. తహశీల్ కార్యాలయంతో పాటు రేషన్ షాపు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్థానికంగా గల గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ముందుగా తహశీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 3480 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వెంకట్ రావు తెలుపగా, దరఖాస్తుదారులకు రసీదులు అందించారా అని కలెక్టర్ ఆరా తీశారు. వచ్చిన అర్జీలను ఆయా కేటగిరీల వారీగా విభజిస్తూ ఆన్లైన్ లో వెంటదివెంట అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇందల్వాయి లోని 12 నెంబర్ రేషన్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్దిదారులకు మూడు నెలలకు సంబంధించి ఒకేసారి అందించిన సన్న బియ్యం పంపిణీ పూర్తి స్థాయిలో జరిగిందా అని డీలర్ ను ప్రశ్నించారు. జూన్ నెలాఖరు నాటితోనే పంపిణీని పూర్తి చేశామని తెలుపగా, కలెక్టర్ రికార్డులలో వివరాలను పరిశీలించారు. అక్కడి నుండి కలెక్టర్ స్థానికంగా గల ఎరువుల పంపిణీ కేంద్రానికి చేరుకొని, ఎరువుల స్టాక్ ను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలకరించి, అవసరమైన ఎరువులు సక్రమంగానే అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎరువుల సరఫరా సంతృప్తికరంగా ఉందని రైతులు తెలుపగా, జిల్లాలో యూరియా సహా ఇతర అన్ని ఎరువుల నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రస్తుత అవసరాలకు సరిపడా ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని, ముందస్తుగానే ఎక్కువ నిలువలను సమకూర్చుకోవాలనే ఆదుర్దా వద్దని హితవు పలికారు. ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. అక్కడి నుండి కలెక్టర్ గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించారు. అవసాన దశలో ఉన్న భవనాన్ని గమనించి, అవసరమైన మరమ్మతులు చేయించాలని డాక్టర్ గంగా ప్రసాద్ కు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు తనిఖీ

* **కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ జూలై 1 (సమయం న్యూస్) : మంగళవారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో : డా. విమల థామస్, ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కాలేజ్ అధ్యక్షతన ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్, జూలై 1, 2025 —— రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యల లో భాగంగా, ఈరోజు మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్, (GMC), జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్ (GGH) మరియు *మాతా శిశు ఆరోగ్య కేంద్రం (MCH బ్లాక్)*లో ఉన్నత స్థాయి తనిఖీ అసెస్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డా. విమల థామస్ బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారని తెలిపారు. బోధన సిబ్బంది పోస్టులు మరియు ఖాళీల స్థితి,హాస్పిటల్‌లోని యంత్రాంగాలు ICU, OT, CT, MRI, CArm లు,విద్యార్థులకు వసతి, హాస్టల్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీ, మెస్, యాంటీ ర్యాగింగ్ వ్యవస్థలు కాలేజ్ మరియు హాస్పిటల్ మధ్య సమన్వయం,విద్యా, వైద్య సేవల నాణ్యత, నిర్వహణ ఊహించబడిన ముఖ్యమైన మార్పులు:ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టుల భర్తీ,వైద్య పరికరాల మరియు భద్రతా సదుపాయాల అప్‌గ్రేడ్,విద్యార్థులకు మెరుగైన వసతి, డిజిటల్ మానిటరింగ్ సిస్టమ్స్ తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీ నివేదికను ముఖ్య కార్యదర్శికి సమర్పించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన రాష్ట్రవ్యాప్తంగా నెలనెలా సమీక్షలో భాగంగా ముందుగల చర్యలు చేపడతారు. ఈ సందర్భంగా డాక్టర్ విమల థామస్ మాట్లాడుతూ హాస్పిటల్ మరియు కాలేజ్ పరిపాలనల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి,న్యాయమైన ఆరోగ్య సేవలు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డా. ఏ. సునీతా దేవి, మెడికల్ సూపరింటెండెంట్, GGH మెదక్, డా. వీ. రవి శంకర్, ప్రిన్సిపల్, GMC మెదక్,డా. జయ, వైస్ ప్రిన్సిపల్, GMC తదితరులు పాల్గొన్నారు

# విద్య, వైద్యం, పౌరసరఫరాల శాఖల సంక్షేమ ప్రగతి పై సమీక్షించిన కలెక్టర్



మెదక్ జూలై 1 (సమయం న్యూస్) : బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు విద్యా,వైద్యం, పౌరసరఫరాల శాఖల ప్రగతిపై సంబంధిత జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ ద్వారా చేపట్టిన బడిబాట కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, డ్రాప్ అవుట్, ఎన్రోల్మెంట్ పై దృష్టి సారించాలన్నారు,మన ఊరు మనబడి కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు విషయంలో చర్యలు తీసుకోవాలి అన్నారు, సోలార్ కిచెన్స్ ఏర్పాటు చేయడంలో భాగంగా పూర్తి వివరాలతో సమగ్ర కార్యచరణ రూపొందించాలని, టెన్త్ పాస్ ఆయన పిల్లలు ఇంటర్మీడియట్ లో ఇంటర్ పాస్ అయిన పిల్లలు డిగ్రీలో ఎన్రోల్మెంట్ చేయాలని, అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకం సమగ్రంగా అమలు చేయాలని, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా యాక్షన్ ప్లాన్ తయారుచేసి సంవత్సరానికి రెండుసార్లు ఆర్ బి ఎస్ కే ద్వారా సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు,వంట చేసే సిబ్బందికి, వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీఎంఆర్ డెలివరీ విషయంలో పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రగతిని సాధించాలన్నారు. అన్ని సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ పరిశుభ్రంగా తయారు చేయాలని, వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని వేడి,వేడి ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు తప్పనిసరిగా అన్నం కూరలపై మూతలు ఉండాలన్నారు, ఫుడ్ ఇంచార్జ్ తప్పనిసరిగా రుచి చూసిన తర్వాత వడ్డించడం అనేది జరగాలన్నారు. అలా జరిగిన పక్షంలో మెనూ నాణ్యత పరిశీలించడంతోపాటు ఫుడ్ పాయిజింగ్ జరగకుండా నివారించవచ్చని తెలిపారు. ఫుడ్ టెస్టింగ్ విషయంలో రిజిస్టర్ ఏర్పాటు చేసి వంట రుచి చూసిన వారి వివరాలను తప్పనిసరిగా రాయలన్నారు సంక్షేమ పాఠశాలల్లో స్టోర్ రూమ్ పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కిచెన్ కు ఉపయోగించే సామాగ్రి, కూరగాయలను భద్రపరచి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. టెండర్ ద్వారా హాస్టల్కు సరఫరా చేసే వస్తువులు నాణ్యత లోపిస్తే రిటన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రాధా కిషన్, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, బి డబ్ల్యు ఓ హైమావతి, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్ ఇతర సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టండి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయ శంకర్ భూపాల పల్లి జూలై 1 (సమయం న్యూస్): మంగళ వారం జిల్లా కలెక్టర్ చాంబర్ లో ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం కనీస మౌలిక సదుపాయాలు కల్పనపై విద్యా, టిజిడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పనకు జిల్లాలోని 5 జూనియర్ కళాశాలలకు 41.07 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇట్టి నిధులతో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు. ఈ నిధులతో సివిల్ మరమ్మతులు, ఎలక్ట్రికల్, మంచినీరు, పారిశుధ్య కార్యక్రమాలు వంటి సదుపాయాలపై ఫోకస్ చేయాలని, ఇట్టి పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న, డీఈఓ రాజేందర్, టీజడబ్ల్యూఐడిసి డిఈ రామకృష్ణ, ఏఈ మహేందర్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలి

**: బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

*** క్షేత్ర స్థాయి లో శానిటేషన్ ఇంజనీరింగ్ తనిఖీలు...**

*** రోడ్డు పై చెత్త వేస్తే జరిమానాలు విధించాలని ఆదేశం...**



వరంగల్ జూలై 1 (సమయం న్యూస్): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం హన్మకొండ పరిధి లోని 31,7,8 డివిజన్ లలో శానిటేషన్ తనిఖీలతో పాటు వడ్డేపల్లి బండ్ పై స్మార్ట్ సిటీ పనులు ప్రశాంత్ నగర్ లోగల 15 ఏం ఎల్ డి సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను కమిషనర్ క్షేత్ర స్తాయి లో సందర్శించి సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ హనుమకొండ పరిధిలోని 30,7,8 డివిజన్ లలో గల హనుమకొండ మెయిన్ రోడ్డు, చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించి గ్రీవెన్స్ లో స్థానికులు అందజేసిన ఫిర్యాదుల ఆధారం గా ఆ ప్రాంతం లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డిసిల్టేషన్ ప్రక్రియ నిరంతరం జరగాలని మెష్ (జాలీ) లు ఏర్పాటు చేయాలని, ఆక్రమణలకు పాల్పడకుండా చూడాలని ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే పెనాల్టీలు విధించడం,తొలగించడం చేయాలని రోడ్డుమీద చెత్త వేస్తే జరిమానాలు విధించాలని ఆదేశించిన కమిషనర్ నిబంధనలు ఉల్లంఘించి చెత్త వేసిన టీ స్టాల్ యజమానికి రూ.10 వేలు పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది తప్పకుండా రెయిన్ కోట్లు ధరించాలని సమయపాలన పాటించడంతో పాటు నాలుగుసార్లు థంబ్ వేయాలని ఆదేశించారు. వడ్డేపల్లి బండ్ ను సందర్శించి స్మార్ట్ సిటీ స్కీమ్ లో భాగంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బండ్ మీద ఏర్పాటు చేయాల్సిన ప్లాంటేషన్ కు సంబంధించిన అంచనాలను తయారు చేసుకుని రావాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. బట్టర్ ఫ్లై పార్కులో ఉన్న సమస్యలను గుర్తించి అట్టి పనుల ను పునరుద్ధరించాలని అన్నారు. అనంతరం ప్రశాంత్ నగర్ లో గల 15 ఏం ఎల్ డి సామర్థ్యం తో నిర్వహించబడుతున్న సీవెజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి చేపడుతున్న ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకుని నిర్వహిస్తున్న రిజిస్టర్ లను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి హెచ్ ఓ రమేష్ ఈ ఈ రవికుమార్ డి ఈ కార్తీక్ రెడ్డి ఏఈ మేనక సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.



* హిమాచల్ ప్రదేశ్... ధర్మశాల లో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ దలైలామా గారిని కలిసి ఆశిర్వాదం తీసుకున్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు.

* కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (CPA) ఇండియా రీజియన్, జోనల్ -II కాన్ఫరెన్స్ లో పాల్గొనడానికి స్పీకర్ తెలంగాణ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు హిమాచల్ ప్రదేశ్ వెళ్ళిన విషయం తెలిసిందే..

# ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని అన్ని రకాల పనుల్లో వేగం పెంచాలి

*** సి.ఈ స్థాయి అధికారి కూడా ఫీల్డ్ విజిట్ చేయాల్సిందే**

*** ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే ఉంటా..ప్రతి రివ్యూకు పనుల పురోగతి చూపించాలి**

*** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ అండ్ బి శాఖ నిధుల విడుదల పై సానుకూలంగా ఉన్నారు**

*** అధికారులు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అన్ని రకాల పనుల్లో ప్రోగ్రెస్ చూపించాలి**

*** రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్ జూలై 1 (సమయం న్యూస్) : ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని అన్ని రకాల పనుల్లో వేగం పెంచాలనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... పనుల్లో పురోగతి పెంచేందుకు ఖచ్చితంగా చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. శాఖ పై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే ఉంటానని, ప్రతి రివ్యూకు పనుల పురోగతి చూపించాలని చెప్పారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తో నిత్యం సంప్రదింపులు జరుపుతూ మన రాష్ట్ర వాటా 300 కోట్ల CRIF ఫండ్ వచ్చేలా కృషి చేశానని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. బిల్స్ క్లియర్ అవుతుంటే అదే స్థాయిలో పనులు కూడా వేగంగా జరగాలనీ,పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులదే కాబట్టి క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అన్ని రకాల పనుల్లో ప్రోగ్రెస్ చూపించాలన్నారు. శాఖలో ఎన్నడు లేని విధంగా సీఎంతో మాట్లాడి ప్రమోషన్లు,పోస్టింగ్స్ ఇచ్చుకున్నామని, హుషారుగా పనిచేసి ఆర్ అండ్ బి కి మరింత పేరు తీసుకురావాలని సూచించారు. హ్యామ్ రోడ్లు పది ప్యాకేజీలు మొదలు చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇఎన్సి జయ భారతిని ఆదేశించారు. రోడ్ యాక్సిడెంట్స్ నిర్మూలించేందుకు బ్లాక్ స్పాట్స్,వర్టికల్ కర్వ్స్ ముందే ఐడెంటిఫై చేయాలనీ సూచించారు. తెల్లాపూర్,అమీన్ పూర్,సంగారెడ్డి,మంచాల, చౌటుప్పల్ రోడ్లు, చిట్యాల,భువనగిరి, హలియ మల్లేపల్లి రోడ్ల పై మంత్రి చర్చించారు. ప్రతి మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి ఆర్ అండ్ బి రోడ్ల కనెక్టివిటీ పెంచేందుకు భూ సేకరణ సమస్య కూడా లేకుండా ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. హ్యామ్ రోడ్ల డిపీఆర్, టెండర్ ప్రాసెస్ పై రెండు రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తాననీ మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆర్ అండ్ బి శాఖ నిధుల విడుదల పై సానుకూలంగా ఉన్నారనీ,హాస్పిటల్స్,రోడ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలనే బాధ్యత మనపై ఉంచారనీ అధికారులకు గుర్తు చేశారు. పినిషింగ్ స్టేజ్ పెండింగ్ లో ఉన్న ఆర్వోబిలు,మెడికల్ కాలేజీలు, టిమ్స్ హాస్పిటల్స్, కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించే సమీక్షలో అన్ని రకాల వివరాలతో సన్నద్ధంగా ఉండాలని,సి.ఈ ల పరిధిలోని ఎస్.ఈ లు,ఈ.ఈ లు మీటింగ్ లో పాల్గొనాలని చెప్పారు. ఇటీవల ప్రమోషన్స్, పోస్టింగ్స్ పొందిన వారు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీక్షలో ఇంచార్జి ఈఎన్సి టి.జయ భారతి,సి.ఈ లు మోహన్ నాయక్,లక్ష్మణ్,రాజేశ్వర్ రెడ్డి,లింగారెడ్డి,ఎస్.ఈ లు,ఈ.ఈ లు పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.



## సొంత నిధులతో మౌలిక వసతుల కల్పన

*** పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

*** కొర్లకుంట చిత్తారమ్మ ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం**

*** కొడకంచి అంగన్వాడి కేంద్రానికి లక్ష రూపాయలు**

*** జిన్నారం ఎస్టి గురుకుల పాఠశాలలో 90 వేల తో మౌలిక వసతులు**

జిన్నారం, జూలై 1, సమయం న్యూస్ : పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జిన్నారం మండలంలోని కొర్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయానికి గతంలో 26 లక్షల రూపాయల సొంత నిధులను అందించగా కొంత మేర పనులు మిగిలిపోయాయి. మంగళవారం మిగిలిన పనుల కోసం మరో రెండు లక్షల రూపాయలను అందించారు.కొడకంచి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి లక్ష రూపాయలు, జిన్నారం పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మంచినీటి పైపులైన్లు,ఎర్తింగ్ పనుల కోసం 90 వేల రూపాయలను అందించారు. జన్నారంలో నిర్మిస్తున్న శివాజీ స్టేడియం బోర్డ్ ఏర్పాటు కోసం 37వేల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ పరమతసహనాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తూ ముందుకు వెళతామని తెలిపారు. కొడకంచి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రాన్ని తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆగస్టు నెలలో వీటిని ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు జనార్ధన్, శివరాజ్, ఆంజనేయులు, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ల వినియోగానికి ప్రోత్సాహానికి అసక్తి గల మహిళా సంఘాలను ఎంపిక :చేయండి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.**



భూపాల పల్లి జూలై 1 (సమయం న్యూస్) : మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో రైతు ఉత్పత్తి సంఘాలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, సహకార సంఘాలకు డ్రోన్స్ పంపిణీపై వ్యవసాయ, ఉద్యాన, సహకార, డిఆర్డీఓ, నాబార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్. మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించేందుకు డ్రోన్ల వినియోగంపై చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పంపిణీ చేసేందుకు 12 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని మండలాల వారీగా ఒక్కో మండలానికి ఒక డ్రోన్ చొప్పున పంపిణీ చేయాలని తెలిపారు. ఇందుకోసం విజయవంతంగా నడుస్తున్న రైతు ఉత్పత్తి సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాల నుండి సభ్యులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ మూడు కేటగిరీల సంఘాలను ప్రామాణికంగా తీసుకుని మండలానికి ఒకటి చొప్పున అన్ని మండలాలు కవరు అయ్యేలా డ్రోన్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, ఉద్యాన వనశాఖాధికారి సునీల్ కుమార్, డిఆర్డీఓ బాలకృష్ణ, డీసీఓ వాల్య నాయక్, నాబార్డు ఈజీఎం చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

epaper.samayamdaily.net
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
APTEL/2006/18267
తెలుగు దినపత్రిక






# పంట మార్పిడితో అధిక దిగుబడులు..

- **ఏడిఏ బాబూనాయక్.**

రాయపోల్, జూలై 1; పంట మార్పిడితో అదిక దిగుబడులు సాధించవచ్చని, ప్రతి రైతు ఇది పాటించాలని గజ్వేల్ ఏడిఏ బాబునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం రాయపోల్ రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత మిషన్లో బాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే కందిల్ ఆర్జీ 52 రకానికి చెందిన కంది మినీ బ్యాగులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100% రాయితీపై ఈ విత్తనాలను అందజేయడం జరిగిందన్నారు. పప్పు దినుసుల సాగును ప్రోత్సహించనికే ప్రభుత్వం ఈ విత్తనాలను అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నరేష్,ఏఈఓ లు ప్రవీణ్, కవిత, స్వర్ణలత, రజిత రైతులు పాల్గొన్నారు.

# సమాజ హితం కోరేవారు వైద్యులు..

జనగాం జూలై 1 (సమయం న్యూస్) : సమాజ హితం కోరే వైద్యు లను గౌరవించడం ధర్మమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం డాక్టర్స్ డే పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనగామ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్యాగానికి ప్రతీక లని రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన ఐ ఎం ఏ, కెమిస్ట్స్ లను అభినందించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లో ఐ ఎమ్ ఎ సహకరించాలని కోరారు. రక్త దాతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తొలుత స్వాగతం తెలిపిన సీనియర్ డాక్టర్ డి లవకుమార్ రెడ్డి డాక్టర్ బి సి రాయ్ గురించి ప్రస్తావిస్తూ డాక్టర్స్ డే విశిష్టతను




గురించి వివరించారు. జిల్లా వైద్యాధికారి డా. మల్లికార్జున్ రావు మాట్లాడుతూ ఐ ఎం ఏ వైద్యుల సహనశీలత సౌజన్య గుణాలను అభినందించారు.ప్రభుత్వ కార్యక్రమాలను సఫలం చేయడంలో వైద్యులు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శిబిరంలో 56 మంది రక్తదానం చేసినట్లు రక్త నిధి వైద్యాధికారి డా పి. కరుణాకర్ రాజు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల చీఫ్ పాథాలజిస్ట్ డా అన్వర్, డా. ఏ. శ్రీనివాస్, పుర ప్రముఖులు కన్న పరశురాములు, డా. కల్నల్ మాచర్ల బిక్షపతి, క్రిష్ణ జీవన్ బజాజ్, కెమిస్ట్స్ అసోసియేషన్ దేవరాజ్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డా సీహెచ్.రాజమౌళి, కెమిస్ట్స్ కార్యదర్శి క్రిష్ణ, దోర్నాల వెంకటేశ్వర్లు, డా. కనకరాజు, డా. వెంకటాచలం, డా. ప్రదీప్, డా. సృజన్, డా. స్వప్నా రాథోడ్, డా. రజినీ, డా. మౌనిక, డా. అనూష, డా. ప్రీతీ దయాళ్, డా. స్వప్న ఐ ఎం ఏ కార్యదర్శి డా. ఏ. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# చదువుతోనే సమాజం లో గుర్తింపు

రాయపోల్,జులై 1: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికనుగుణంగా నడుచుకోవాలని లయన్స్ క్లబ్ గజ్వేల్ విస్డం క్యాబినెట్ చైర్ పర్సన్ కరుణాకర్ అన్నారు. మంగళవారం డాక్టర్ల దినోత్సవం పురస్కరించుకుని రాయపోల్ మండలం వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్ విస్డం తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజిని, ఉపాధ్యాయులు సుధాకర్, వరప్రసాద్, మోహన్, రాజయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం త్రాగునీటి నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలి

- **పాత త్రాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ అవకాశాల పై నివేదిక**
- **మిషన్ భగీరథ ఇంట్రా త్రాగునీటి సరఫరా పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి జూలై 1 (సమయం న్యూస్) : జిల్లాలో చేపట్టిన పెండింగ్ త్రాగు నీటి ఇంట్రా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మిషన్ భగీరథ ఇంట్రా త్రాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. అంతర్గం, పాలకుర్తి, మంథని, కమాన్ పూర్, ముత్తారం, రామగిరి మండలాల్లోని గ్రామాల్లో పెండింగ్ ఉన్న ఇంట్రా మిషన్ భగీరథ పనులకు సంబంధించి చేపట్టిన పనుల పురోగతి వివరాలను కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో పెండింగ్ ఉన్న ఇంట్రా మిషన్ భగీరథ పనుల పూర్తి కు దృష్టి సారించాలని అన్నారు. ఫిబ్రవరి నెలలో మంజూరు చేసిన ఇంట్రా పనులు ఇంకా పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులలో ఇండ్లకు పైప్ లైన్ ద్వారా త్రాగు నీరు చేరేలా చూడాలని అన్నారు. కాంట్రాక్టర్ లో వెంటపడి పనులు త్వరగా అయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు పనుల పురోగతి పై ఇంజనీరింగ్ అధికారులు రివ్యూ చేపట్టాలని అన్నారు. మంథని ప్రాంతంలో త్రాగునీటి సరఫరా లో ఉన్న ఇబ్బందులు గురించి గ్రామాల వారీగా నివేదిక తయారుచేసి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపెల్లి జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి సరఫరా కాకుండా పాత గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల జాబితా తయారు చేసి వాటి పునరుద్ధరణ అవకాశాల పై రిపోర్ట్



అందించాలని అన్నారు. వర్షాకాలం నాలుగు నెలల పాటు నీటి నాణ్యత పరీక్షలను రెట్టింపు చేయాలని అన్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. డ్రైనేజీ సమీపంలో ఉన్న త్రాగునీటి లైన్ల భారీ వర్షాల సమయంలో మిక్స్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ హాస్టల్స్ లకు సమృద్ధిగా త్రాగునీటి సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి సంక్షేమ హాస్టల్ వద్ద త్రాగునీటి సరఫరా పరిస్థితులను మిషన్ భగీరథ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు నీటి సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దంతాన్ పల్లి నాగమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం

- **శివంపేట్ పీఎస్ సీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి**

శివంపేట్ జూలై 1( సమయం న్యూస్) : శివంపేట్ మండల్ దంతాన్ పల్లి గ్రామానికి చెందిన కొత్తగమ్ములోల నాగమ్మ మరణించడం జరిగింది ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ప్రజా ఆపద్బాంధవుడు ప్రజా సేవకుడు శివంపేట్ మండల్ పిఏసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి వారి కుటుంబానికి పరామర్శించి 5,000 లు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గ్రామ ప్రజలు దంతాన్ పల్లి గ్రామ సివిఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం

హనుమకొండ, జులై 01(సమయం న్యూస్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం చేకూర్చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిస్ అన్నారు. బి ఎస్ రాయ్ వైద్యరంగంలో చేసిన సేవలు గుర్తుగా జులై 1న భారతదేశంలో డాక్టర్స్ డే నిర్వహించుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజలను చేసి కలెక్టర్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరు అయ్యి జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా వైద్య అధికారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేసినారు. ప్రతి పేదవాడికి వైద్యం అందాలని మరియు ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తాను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యానని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యేవిధంగా ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీని ప్రోత్సహించాలని కోరినారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు వినియోగించుకోవాలని,




ప్రతి వైద్యుడు అంకితభావంతో ప్రజలకు మెరుగు మెరుగైన సేవలు అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్రీ వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ల యొక్క సేవలు మరువలేనివని అందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసినారు. కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కె. రామ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ డాక్టర్ బి.సి రాయ్ గారి సేవలు మర్చిపోలేవని, ప్రతి పేదవానికి వైద్య సేవలు అందాలని, ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తునది తెలియజేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అక్కయ్య గారు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా,సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించేలా, నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య గారిని, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కె రామ్కుమార్ రెడ్డి గారిని, అడిషనల్ వైద్య అధికారిడాక్టర్ టి.మద మోహన్ రావు గారిని, జిల్లా ఇమ్యూనిజషన్ అధికారి డాక్టర్ మహేందర్ గారిని, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ హిమబిందు గారిని, ప్రోగ్రామ్ అధికారి ఎం సి హెచ్ డాక్టర్ మంజుల గారిని, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ అహ్మద్ గారిని, జిల్లా కలెక్టర్ గారు శాలువాతో సన్మానించడం జరిగినది. హన్మకొండ జిల్లాలో పనిచేస్తున్నటు వంటి వైద్యులలో హాస్టల్స్ మరి స్కూల్స్ సందర్శన ఎక్కువ చేసిన డాక్టర్స్ ని మరియు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం లో టిడి ARV, అస్వ్ అందుబాటులో ఉంచినటువంటి మరియు అత్యధిక సంఖ్యలో ఇంజక్షన్లు ఇచ్చినటువంటి ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరాల కు ప్రశంసా పత్రాల ప్రధానం చేయడం జరిగింది. వైద్యుల క్రీడాఉత్సవాలలో బహుమతులు పొందిన వైద్యులకు ప్రశంస పత్రము,కప్ బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, బస్తీ, పల్లె దవాఖాన వైద్యాధికారులు, ఆర్ బి ఎస్ కే వైద్యాధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీ కోలా రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూలై 1 (సమయం న్యూస్) : మంగళవారం సూర్యాపేట పట్టణంలోని యాదాద్రి టౌన్షిప్ వద్ద నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి భవన్ ద్వారా జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు వారి యొక్క కార్యకలాపాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని వారు చేసిన ఉత్ప త్తులకు మార్కెటింగ్, ఉత్పత్తుల ప్రదర్శన,మేళాలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈ మాధవ్ కి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డి ఆర్ డి ఓ వివి అప్పారావు, పంచాయతీరాజ్ డిఇ మనోహర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు

- **సానిటేషన్, న్యూట్రిషన్,ఎడ్యుకేషన్,హెల్త్, అంశాలపై ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి**

మహబూబ్ నగర్ జిల్లా జూలై 1 (సమయం న్యూస్) : మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,జిల్లాలోని డోర్నకల్,కురవి మండలలో విస్తృతంగా పర్యటించారు. బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు, సిబ్బంది యొక్క హాజరు పట్టికను, మందుల స్టాక్ వివరాలను,పరిసరాలను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని





అన్ని ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, షెడ్యూలు ప్రకారం వైద్య క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. వెన్నారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన న్యూట్రిషన్ ఫుడ్ అందించాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన, మన్నెగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో ఏ.ఐ ద్వారా బోధింపబడుతున్న మ్యాథమెటిక్స్ ఇతర సబ్జెక్టులను విద్యార్థులు ఏ విధంగా నేర్చుకుంటున్నారో పరిశీలించి వారి పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో అడ్మిషన్లను గణనీయంగా పెంచినందుకు అభినందించారు. వెన్నారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను కూడా పరిశీలించినారు గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో ఎన్రోల్మెంట్ గణనీయంగా పెంచుటలో గ్రామస్తుల భాగస్వామ్యాన్ని కూడా గమనించి గ్రామస్తులను అభినందించారు. రెండు పాఠశాలల్లోని భౌతిక వనరులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగిన సూచనలు చేసినారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ అంతర్గత అంశాలపై స్పందించిన కిషన్ రెడ్డి

* పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
* బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
* రెండు పార్టీలు అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ
* మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని భారాస అప్పుల్లోకి నెట్టిందని విమర్శ
* ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్



కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదని ఆయన అన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు. మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మంగళవారం హైదరాబాద్ శివార్లలోని మన్నెగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## బాలానగర్ ఫ్లైఓవర్‌పై ఒకేచోట రెండు ప్రమాదాలు.. ఒకరి మృతి, ఎస్ఐకి గాయాలు

* బాలానగర్ ఫ్లైఓవర్‌పై జంట ప్రమాదాలు
* వేగంగా వచ్చిన కారు ఢీకొని పాదచారి అక్కడికక్కడే మృతి
* ప్రమాద స్థలంలో విచారణ జరుపుతున్న పోలీసులను ఢీకొట్టిన డీసీఎం
* ఈ ఘటనలో ఎస్ఐ వెంకటేశంకు తీవ్ర గాయాలు




పోలీసుల అదుపులోకి కారు, డీసీఎం డ్రైవర్లు

హైదరాబాద్ నగరంలోని బాలానగర్ ఫ్లైఓవర్‌పై మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక ప్రమాదం జరిగిన చోటే మరికాసేపటికి మరో ప్రమాదం జరిగింది. ఈ జంట ప్రమాదాల్లో ఒకరు మరణించగా, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... బాలానగర్ పైవంతెనపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక వ్యక్తిని అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించడం ప్రారంభించారు. అయితే, పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే ఊహించని రీతిలో మరో ప్రమాదం జరిగింది. అదే మార్గంలో వచ్చిన ఒక డీసీఎం వ్యాన్ అదుపుతప్పి, విచారణ జరుపుతున్న పోలీసు సిబ్బందిని ఢీకొట్టింది. ఈ రెండో ప్రమాదంలో బాలానగర్ ఎస్ఐ వెంకటేశంకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన తోటి సిబ్బంది, ఆయన్ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ జంట ప్రమాదాలకు కారణమైన కారు డ్రైవర్‌ను, డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకే ప్రదేశంలో స్వల్ప వ్యవధిలో రెండు ప్రమాదాలు జరగడంతో ఫ్లైఓవర్‌పై కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన.. మరో మూడు రోజులు వానలే!

* బంగాళాఖాతంలో అల్పపీడనం.. కొనసాగుతున్న ఆవర్తనం
* తెలంగాణలోని 19 జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన
* ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల భారీ వానలు పడే అవకాశం
* గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక
* సముద్రంలోకి వెళ్లొద్దని మత్స్యకారులకు స్పష్టమైన ఆదేశాలు




బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇప్పటికే కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనానికి తోడు, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా హెచ్చరికలు జారీ చేశారు.

* **తెలంగాణలోని 19 జిల్లాలకు అలర్ట్**

ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణకు ప్రత్యేకంగా వర్ష సూచన జారీ చేసింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

* **ఉత్తరాంధ్రపై అధిక ప్రభావం**

అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో అల్పపీడనం ఏర్పడుతున్నందున, దీని ప్రభావం ఉత్తరాంధ్రపై ఎక్కువగా ఉంటుందని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

* **మత్స్యకారులకు హెచ్చరికలు**

తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని సూచించారు. అధికారులు తదుపరి సూచనలు ఇచ్చే వరకు వేచి చూడాలని కోరారు.

## పాశమైలారం పేలుడు ఘటన.. 42కి చేరిన మృతుల సంఖ్య

* పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు
* మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
* శిథిలాల కింద మరిన్ని మృతదేహాలు
* కొనసాగుతున్న సహాయక చర్యలు
* దుర్ఘటనా స్థలాన్ని సందర్శించనున్న సీఎం రేవంత్ రెడ్డి
* రియాక్టర్ పేలుడే కారణమని ప్రాథమిక అంచనా



తెలంగాణలోని పాశమైలారంలోని సిగాచీ కెమికల్ పరిశ్రమలో సోమవారం సంభవించిన భారీ పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేడు సహాయక చర్యలు కొనసాగుతుండగా మృతుల సంఖ్య 42కి చేరింది. శిథిలాల కింద మరిన్ని మృతదేహాలు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు 12గా ఉన్న మృతుల సంఖ్య, మంగళవారం ఉదయానికి 34కి పెరిగింది. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు లభ్యం కావడంతో ఈ సంఖ్య మరింత పెరిగింది. "శిథిలాలను తొలగిస్తుండగా మరికొన్ని మృతదేహాలు బయటపడ్డాయి. సహాయక చర్యలు చివరి దశలో ఉన్నాయి" అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికాసేపట్లో ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు.

* **గవర్నర్ దిగ్భ్రాంతి.. సహాయక చర్యలపై ఆదేశాలు**

ఈ విషాద ఘటనపై తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పేలుడు బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని వెంటనే అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయలేని పని తెలంగాణలో చేస్తున్నాం: మంత్రి పొంగులేటి

* దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్న మంత్రి పొంగులేటి
* వరంగల్లు జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి
* రాయపర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్‌పై విమర్శలు



దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా పేదలకు సన్న బియ్యం ఇవ్వడం లేదని, కానీ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి నిన్న వరంగల్లు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా పేద వర్గాలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చిందని, కానీ తమ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల మేలు కోసం భూభారతి చట్టం తీసుకువచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని చెప్పారు. పార్టీ గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని తెలిపారు.

## ప్రభుత్వ అలసత్వంతోనే పాశమైలారం ఘటన ఎమ్మెల్సీ కవిత

**: ఎమ్మెల్సీ కవిత**



పటాన్‌చెరు: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రభుత్వ అలసత్వం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. పరిశ్రమల్లో సేఫ్టీపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బాధితులకు గ్రీన్ ఛానల్ ద్వారా సాయం అందించాలన్నారు.

## ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత

హైదరాబాద్: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. బీవీ పట్టాభిరామ్.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ సంతానంలోని పదిహేను మందిలో ఒకరు. కౌమారదశలో కాలి వైకల్యంతో కలిగిన ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిదిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేసే రోజుల్లోనూ సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండుమూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి పట్టాభిరామ్ ఎదిగారు.

**ప్రజలను జాగృతం చేస్తూ..**

1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండురెళ్లు ఆరు'లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు శోభన్ బాబు, అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. పలు పత్రికల్లో బీవీ పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు.

* **చంద్రబాబు, బండి సంజయ్, పవన్,**



**లోకేశ్ సంతాపం**

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ మృతికి ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి బండి సంజయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు. పట్టాభిరామ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చంద్రబాబు, లోకేశ్ అన్నారు. ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు.

